కర్నూలు | నంద్యాల
వార్త
26 జూన్, 2024 బుధవారం పేజీలు 4

# డా.బైరెడ్డి శబరికి ప్రధాని నరేంద్ర మోధీ అభినందనలు, అశీస్సులు

**నంద్యాల, జూన్ 25, ప్రభాతవార్త ప్రతినిధిః**

నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డా.బైరెడ్డి శబరికి ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు, తన అశీస్సులు తెలిపారు. ఈసందర్భంగా ప్రధాని నరేంద్రమోధీని ఎంపీ డా.బైరెడ్డి శబరి కలిసి తన ఆశీస్సులు తీసుకున్న సందర్భంలో నంద్యాల పార్లమెంటు యొక్క విశిష్టతను వివరిస్తు నంద్యాల పార్లమెంటు నుండి ఎంపీలుగా ఎన్నికైనా నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా, పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా, పెండెకంటి వెంకటసుబ్బయ్య కేంద్రమంత్రిగా, రాష్ట్రాల గవర్నర్లుగా, ఉత్తమ పార్లమెంటరియన్‌గా గుర్తింపు తెచ్చారని వివరించాగా డా.శబరి కూడ అదేస్థాయిలో రాణించాలని, తన సంపూర్ణ సహకారం నంద్యాల పార్లమెంటులోని ప్రజలందరికి ఉంటుందని ప్రధాని మోధీ శబరికి భరోసా నిచ్చారు.ఈసందర్భంగా బైరెడ్డి శబరితో పాటు ఆమె భర్త డా.శివచరణ్‌రెడ్డి, తండ్రి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తల్లి బైరెడ్డి భారతమ్మ, చిన్నాన బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, చెల్లెలు బైరెడ్డి శర్వానిలు ప్రధాని నరేంద్ర మోధీని కలిసిన వారిలో ఉన్నారు.



# శ్రీశైలక్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే బుడ్డా

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్25, ప్రభాతవార్త**

శ్రీశైలం మహాపుణ్యక్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచనున్నట్లు శ్రీశైలం నియేజకవర్గం ఎమ్మెల్యేబుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేసారు.ఈక్రమంలోనే మంగళవారంనాడు క్షేత్ర పరిపాలన కార్యలయ భవనంలోని సమావేశ మందిరంలో దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, సహకార్యనిర్వహణాదికారులు హరిదాసు, ఫణిథరప్రసాద్, మొహన్,స్వాములు,దేవస్థానం ఈఈలు మురళీధర్‌రెడ్డి,రామకృష్ణ,అన్ని విభాగాల మూనిట్ అధికారులు,పర్యవేక్షకులు తదితర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా ఏమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లడుతూ శ్రీశైలక్షేత్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు ప్రత్యేక దృష్టిఉందని,తదనుగుణంగా క్షేత్రాన్ని అబివృద్ధికి నాంది పలకడం జరుగుతుందని వెల్లడిపరిచారు. క్షేత్రంను దేశం నలుమూలల నుండి భక్తులు సందర్శించడం జరుగుతుందని అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాల కల్పన పట్ల ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.అదే విధంగా దేవస్థానం అతిధి గృహాలు,వసతి గదులలోని సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని చెప్పారు.అబివృద్ధికి ముందస్తుగానే బృహత్తర ప్రణాళిక ఉండలన్నారు. అదే విధంగా సిబ్బంది అందరూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలు అందించాలన్నారు.అన్ని విబాగాలు కూడా పరస్పర సమన్వయంతో క్షేత్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈక్రమంలోనే ఆలయ పాలనలో జవాబుదారి తనం, పారదర్శకత ఉండాలన్నారు.కాగా సమీక్ష సమావేశంలో ముందుగా ఈఓ పెద్దిరాజు దేవస్థాణ కార్యకలపాలను,భక్తుల రద్ది,భక్తులకు కల్పించబడు తున్న వసతి,దర్శన ఏర్పాట్లు మొదలైన అంశాలను ఏమ్మెల్యేకు వివరించారు.తదుపరి అన్నప్రసాద విభాగంను ఏమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పరిశీలించి తదుపరి అన్నప్రసాద స్వీకరన చేసారు.



# శ్రీశైలం నియోజకవర్గంలో.. వైసిపి క్యాడర్ కోల్పోతున్నారా..?

- : నమ్ముకున్న నాయకులు, కార్యకర్తల ప్రయాణం ఏ పార్టీవైపు
- : ఓటమి చెందిన నియోజకవర్గం వైపు కన్నెత్తిచూడని నాయకత్వం
- : మరో పార్టీ వైపు మంతనాలు కొనసాగిస్తున్నారని విమర్శలు
- : శ్రీశైలం నియోజకవర్గంలో వైసిపి పార్టీ క్యాడర్ కొనసాగుతుందా
- : మరో ఐదేళ్ళ వరకు టిడిపి పార్టీ ఏకపక్షంగా పరిపాలన కొనసాగిస్తారా



**గత నెల రోజుల క్రిందట రాష్ట వ్యాప్తంగా వైసిపి, టిడిపి పార్టీల మధ్య హోరా హోరిగా రాజకీయంను కొనసాగించారు. ఒక్కసారి ప్రజా తీర్పు రావడంతో వైసిపి పార్టీ క్యాడర్ కోల్పోతుందా అనే విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. శ్రీశైలం నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చెందడంతో నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించడంలో విఫలమైయ్యారని చెప్పవచ్చు. చివరకు పార్టీ క్యాడర్ కోల్పోతున్నారా లేక నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుస్తారా అనే చర్చ జోరుగా కొనసాగుతుంది.**

**ఆత్మకూరు జూన్25,ప్రభాతవార్త:**

ఈ నేపధ్యంలోనే నంద్యాల జిల్లాలో పలువురు వైసిపి సీనియర్ మాజీ ఎంఎల్ఏలు బిజెపిపార్టీతో పోత్తు కుదిరించుకునేందుకు కీలకమైన రాజకీయాలను కొనసాగిస్తున్నట్లు మరో సమాచారం. నియోజకవర్గంలో వైసిపి పార్టీ క్యాడర్ కోల్పోతే ఆ పార్టీకి మరో ఇంచార్జీ సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారా లేక వైసిపి పార్టీలో అన్ని కోల్పోయి నిరుత్సహంగా ఉన్న కార్యకర్తలకు నాయకులకు భరోసా ఎవరు కల్పిస్తారు. అనే విషయం తేట తెల్లం కావాల్సి ఉంది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఐదేళ్ళ టిడిపి పరిపాలనలో ఏకపక్ష పరిపాలన కొనసాగించేందుకు ఆ పార్టీ నేతలు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. క్యాడర్‌ను కాపాడుకోలేకపోతే వైసిపిపార్టీలో మరో నాయకుడు ఎవరు వస్తారు అనే ఉత్కంఠ నెలకొందని చెప్పవచ్చు. గెలుపు ఓటమిలు సర్వసదరణంగా జరుగుతునే ఉంటాయి నియోజకవర్గంలో నమ్ముకున్న నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించలేన్నప్పుడు వైసిపి క్యాడర్ మరింత దిగజారుదు రాజకీయాలు కొనసాగిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైన్నప్పటికి శ్రీశైలం నియోజకవర్గంలో వైసిపి క్యాడర్ కొనసాగుతుందా లేక కనుమరుగు అవుతూ ఆ పార్టీ నేతలు బిజెపి పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారా అనే విషయాని వేచిచూద్దాం.

# చిరుతపులి దాడిలో.. మహిళ మృతి..!

**నంద్యాల, జూన్ 25, ప్రభాతవార్త ప్రతినిధిః**

చిరుతపులి దాడిలో మహిళ మృతిచెందిన సంఘటన మంగళవారం మహానంది, శిరివెళ్ళ మండలాల పరిధిలోని నల్లమల అడవి ప్రాంతంలో వున్న పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరూన్ బీ కట్టెల కోసం అడవి ప్రాంతంలోకి వెళ్లినప్పుడు చిరుతపులి దాడిలో మృతిచెందిందని వారి బంధువులు తెలిపారు. కట్టెల కోసం అడవిలోకి వెళ్లి ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో వారి బంధువులు వెళ్లి చూడగా పులిదాడిలో మృతి చెంది ఉందని తెలిపారు. వెంటనే వారు అటవీశాఖ అధికారులకు సమాచార అందజేయగా చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య, డిఆర్ఓ రాజు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పులిదాడిలో మహిళా మృతిచెందడంతో అక్కడి స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు చిరుతపులి దాడుల నుండి పచ్చర్ల ప్రజలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. గత నెల రోజులుగా చిరుత దాడులు వరుసగా జరుగుతున్నాయని అటవీశాఖాధికారులు స్పందించి పచ్చర్ల మహానంది క్షేత్ర పరిసరాల్లో చిరుత సంచారం అధికంగా ఉందని తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# తొలి క్యాబినెట్‌లో ఎన్‌టిఆర్ హెల్త్‌యూనివర్శిటిగా పేరుమార్పు




**కర్నూలు హాస్పిటల్, జూన్ 25, ప్రభాతవార్తః**

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీని వైయస్‌ఆర్ హెల్త్‌యూనివర్శిటిగా ఉత్తర్వులు జారీచేసిన 20 నెలల తరువాత అత్యధిక మెజార్టీ సీట్లతో అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ తొలి కా్యబినెట్‌లోనే ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీగా పేరుమార్చడాన్ని స్వాగతీస్తు మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్, నగర పార్టీ అద్యక్షులు నాగరాజుయాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, ఎస్‌కే బషీర్, ధరూర్ జేమ్స్ తదితరులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర బ్ంగా వారు మాట్లాడుతూ హెల్త్ యూనివర్శిటి పేరు మార్పు వల్ల ఇప్పటివరకు చదువుకొని సర్టిఫికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడతారని అనేక మంది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లె ప్రయత్నం చేసినప్పటికి వైసీపీ ప్రభుత్వం ఇవేవి పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహారించి యూనివర్శిటికి ఎన్‌టిఆర్ పేరును తొలగించిందన్నారు. జగన్‌రెడ్డికి ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే మంచి కంటే చేడు ఎక్కువ చేసి ప్రతిపక్ష హోదా కూడ పార్టీకి రాని స్థితికి దిగజారిందన్నారు. తండ్రిపై ప్రేమ ఉంటే యూనివర్శిటి స్థాపించి తండ్రిపేరు పెట్టుకోవాలి తప్పా ఉన్నపేరును తొలగించి తన తండ్రి పేరు పెట్టుకోవడం మంచిది కాదన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు బాల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆదాము, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం ఉద్యోగులకు ఎమ్మెల్యే బుడ్డా తీపికబురు

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్25, ప్రభాతవార్త**

శ్రీశైలం దేవస్థానంలో శాశ్వత ప్రాతిపధికన ఉధ్యోగులుగా విధులను నిర్వర్తిస్తున్న వారికి శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తీపి కబరందించారు.ఈక్రమంలోనే మంగళవారంనాడు దేవస్థానం ఉధ్యోగులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉధ్యోగుల యూనియన్ ఆధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి ఇంచార్జ్ డిఈ వెల్లడిపరచిన దేవస్థానం ఉధ్యోగుల ఇళ్ల స్థలాలు ఇప్పించే ఏర్పాటు చేయాలని కోరడంతో ఏమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లడుతూ ఉధ్యోగుల ఇళ్ల స్థలాల విషయంపై తప్పకుండా సానుకూలతను బట్టి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఏమ్మెల్యే ఇచ్చిన హామీకి ఉధ్యోగులందరు హర్షద్వానాలు తెలిపారు.ఈక్రమంలోనే దేవస్థానం సిబ్బంది అందరి తరుపున ఏమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఉధ్యోగులు శాలువతో,పూలమాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు,ఈఈ రామకృష్ణ,తదితర అధికారులు,సిబ్బంది పాల్గోన్నారు.



# ఆదోని అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టండి

- ప్రభుత్వ స్థలాల్లో అనధికారమైన కట్టడాలపై చొరవ చూపాలి
- రోడ్డు ప్రమాదాలు జరుగకుండ పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- గుంతలు పడిన రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలి
- సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ,ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

**ఆదోని, జూన్ 25, ప్రభాతవార్త**

ఆదోని అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని,ప్రభుత్వ స్థలాల్లో అనధికారమైన కట్టడాలపై చొరవ చూపాలని,రోడ్డు ప్రమాదాలు జరుగకుండ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, గుంతలు పడిన రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిలు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సమీక్షలు జరిగినా రోడ్డు సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరాతీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని ఆర్అండ్‌బి అధికారులకు ఆదేశించారు. పట్టణంలో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉన్నందువలన వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని,నోపార్కింగ్ ఏరియాలో పార్కింగ్ చేయకుండ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆదోని అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ రహదారులు,ప్రభుత్వ భవనాలు త్వరతగతిన గుర్తించి తక్షణమే ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో అధిక వర్షపాతం పడే సూచన ఉన్నందున లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడున్న డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుని అవసరమైన మేరకు కొన్ని పరిస్థితుల్లో సుమోటోగా కంప్లైంట్ తీసుకుని శాంతిభద్రతలు పరిరక్షించాలన్నారు. ముఖ్యంగా రాంజల చెరువులో ప్రస్తుతం ఉన్న నీటిని తొలగించి వర్షపునీటిని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలన అధికారి సిఆర్ శేషయ్య,డిఎస్పీ శివనారాయణస్వామి,ట్రైనీ డిఎస్పీ ధీరజ్, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరెడ్డి,నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్‌రెడ్డి,ఆర్టీఓ నాగేంద్ర,మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శశిర దీప్తి,ఆర్టీసి డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ,పోలీసు,రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీమఠంలో ఘనంగా శ్రీ జయతీర్థుల ఆరాధన వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన పీఠాధిపతి
- పీఠాధిపతిచేత భక్తులకు అనుగ్రహ సందేశం
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**మంత్రాలయం, జూన్ 25,ప్రభాతవార్త:**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతులైన శ్రీ జయతీర్థుల ఆరాధన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా శ్రీ జయతీర్థుల బృందావనానికి పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీమఠం ఊంజల మంటపంలో పండితులు,పురోహితుల ఆధ్వర్యంలోప్రవచనాలు అందించారు.అనంతరం పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చారు.శ్రీమఠం ప్రాకారంలో అశేష భక్తులమధ్య సువర్ణ రథోత్సవం నిర్వహించారు.శ్రీ జయతీర్థులు నవబృందావనంలోని శ్రీ పద్మనాభతీర్థుల మూల బృందావనానికి శ్రీ న్యాయసుధా గ్రంధాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకుంటూ ఉత్సవం జరిపారు.ఈ వేడుకల్లో పండితకేసరి,రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజా ఎస్ గిరియాచార్,జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారి,మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాసరావు,వెంకటేష్‌జోషి,అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి,పిఆర్ఓ వ్యాసరాజాచారి.ద్వారపాలక అనంతస్వామి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పట్టణ ప్రజలకు విద్యుత్ తీగలతో పొంచి ఉన్న.. ప్రమాదం..!

- : నిత్యం రద్దీగా ఉన్న ప్రాంతంలో కరెంట్ తీగలతో తప్పిన ప్రమాదం
- : సిమెంట్ లారికి తగిలి ప్రాణాలతో బయట పడ్డా 8 కార్మికులు, డ్రైవర్
- : విద్యుత్‌శాఖ అధికారులు స్పందించకపోతే ప్రజల ప్రాణాలకు పెన్నుముప్పు

**ఆత్మకూరు జూన్25,ప్రభాతవార్త:**

వర్షాకాలంలో విద్యుత్ తీగలతో పట్టణ ప్రజలకు పోంచిఉన్న ప్రమాదంగా మారిందని చెప్పవచ్చు. మంగళవారం పట్టణంలో సిమెంట్ లారీ లోడ్డు చేసేందుకు వచ్చిన లారీలో 8మంది కార్మికులు డ్రైవర్‌తో సహా ప్రాణాలతో బయట పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని శివాలయం వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం ప్రజలతో రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో పలువురు ప్రముఖులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తూ తమ పనులు చేసుకునేందుకు వెళ్తూంటారు. అయితే భవనం కట్టడాలు అధికంగా ఉండడతో ఒక్కప్పుడు లారీలు వెళ్లే రహదారిగా ఉండేది విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతూ ఉండడంతో అనంతపురం జిల్లా నుంచి సిమెంట్ అన్‌లోడ్ చేసేందుకు లారీ రావడంతో ఉదయం 10గంటల సమయంలో సిమెంట్ ఆన్‌లోడ్ చేసే కార్మికులతో సహా లారీలోనే ఉన్నారు. ఒక్కసారి లారీ పైబాగం తీగలకు తగలడంతో అక్కడికిక్కడే మెయిన్ కరెంట్ తీగ తెగి క్రింద పడడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పొరపాటును ఉండి ఉంటే 9మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండేది. పట్టణంలో విద్యుత్ శాక అధికారులు రోడ్ల క్రింద ఉన్న కరెంట్ తీగలను ప్రజలకు, వాహనాలకు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను విన్నవించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశాలలో కరెంట్ తీగలు క్రిందికి వేలాడుతూ గాలి వస్తే తెగిపోయో విదంగా ఉన్నాయి. అలాంటి ప్రాంతాలను విద్యుత్‌శాఖ అధికారులు గుర్తించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారని పలు ప్రజా సంఘాలు ఆశాఖ పనితీరును విమర్శిస్తున్నారు.



# ఆర్ అండ్ బి రోడ్డును తవ్వుతుంటే అధికారులు రక్షించుకోవడం నేరమా? : -టిడిపి నాయకులు



**కొలిమిగుండ్ల, జూన్ 25, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయ విలేఖరుల సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ బి ఆర్ లక్ష్మీరెడ్డి అధ్వర్యయంలో సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో మంగళవారం వచ్చిన దినపత్రిల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం, అధైర్యపడవద్దు అని కొన్ని పత్రికలు ప్రచురించాయి. మాజీ కాటసాని రామిరెడ్డి కొలిమిగుండ్లమండలంలోని తుమ్మల పెంట గ్రామంలో పర్యటించినప్పుడు ఆర్‌అండ్‌బి మంత్రిగా వున్న బిసి జనార్ధన్‌రెడ్డిని గౌరవం లేకుండా ఏకవచనంతో మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యాలు చేయడం జరిగింది. స్పందించిన టిడిపి నాయకులు మీరు 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నారు, అనుభవం మీకు ఉంది, మీరు మాట్లాడిన మాటల్లో అనుభవం లేని ఒక సాధారణ వ్యక్తిలా మాట్లాడినట్లు తేటతెల్లమయింది. అల్ట్రాటెక్ సిమెంటు వారు ఏ గ్రామ పంచాయితీలో అయిన సిఎస్‌ఆర్ గ్రాంట్ మంజూరు చేయాలంటే ఆ గ్రామ పంచాయితీ తీర్మాణం తీసుకొని గ్రామానికి నిధులు మంజూరు చేస్తారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం కోసం ఆర్ అండ్ బి డిపార్టుమెంటు నుండి అనుమతి తీసుకున్నారా అన్నది ఇక్కడ ముఖ్యం. మీరు చెప్పినట్లుగా సిఎస్‌ఆర్ నిధులు మంజూరు చేయిస్తే మీరు వర్కు ఇప్పించిన కాంట్రాక్టరు ఆర్ అండ్ బి అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నిస్తున్నాం. మీరు తప్పులుచేసి మీ చేతగాని తనాన్ని మా మంత్రి మీద నెట్టడం మీ అసమర్థతగా నిదర్శనమని పేర్కొన్నారు. తుమ్మల పెంట గ్రామానికి చెందిన టి మల్లేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసులు మోపారని మీరు చెబుతున్నారే మీరు సత్యం తెలిసి మాట్లాడుతున్నారా మీ వైసీపీ కార్యకర్తల మెప్పుకోసం మాట్లాడుతున్నారా అనే సందేహం మాకు కలుగుతుంది. మీరు ఆర్ అండ్ బి రోడ్డును తవ్వుతుంటే ఆర్ అండ్ బి రోడ్డు అధికారులు రోడ్డును రక్షించుకోవడం నేరమా? ఇష్టానుసారంగా రోడ్డును తవ్వుతుంటే చేతుల కట్టుకొని చూడాలా అన్నారు. తప్పుచేసిన ఏవరైనా చట్టం తన పని తాను చేస్తుందని ఆర్ అండ్ బి రోడ్డుకు నష్టం వాటిల్లినప్పుడు అధికారులు కేసు పెట్టడం వారి విధి నిర్వహణలో ఒక భాగమే తప్పా దానిని మీరు రాజకీయం చేయడం ప్రజల సానుభూతికోసం ప్రజలవద్దకు పోవడానికి దీనిని సాకుగాచేసుకొని వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి గ్రామాల్లో లబ్ధిపొందాలని చుస్తే చట్టం ఇక్కడ చుస్తు ఊరుకోదన్నారు. మంత్రి మీద అనుచిత వ్యాఖ్యాలు చేస్తే చూసు ఊరుకునేది లేదన్నారు. మీలా 2019లో ఎమ్మెల్యే అయిన తరువాత ప్రశాంతంగా ఉన్న కొలిమిగుండ్ల మండలంలో మీ వైసీపీ కార్యకర్తలు చింతలాయపల్లె గ్రామానికి టిడిపి కార్యకర్తను బెలుం వద్ద అతిదారుణంగా నడిరోడ్డుపై నరికిచంపితే చంపినవారిని వెనకే సుకున్న చరిత్ర మీదన్నారు. మా నాయకుడిని మాట్లాడేంత అర్హత మీకు, మీనాయకులకు లేదన్నారు. మా నాయకుడు చట్టాన్ని గౌరవించే నాయకుడిగా ఉంటారని చట్టవ్యతిరేక పనులు చేయరని తెలిపారు. రోడ్లు తవ్వుతుంటే ఆర్ అండ్ బి అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకుంటు న్నారు తప్పా ఇందులో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ విఆర్ లక్ష్మీరెడ్డి, కృష్ణ రంగారెడ్డి, అమర్నాధ్‌రెడ్డి, ఎంవి శివరామిరెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, శేషారెడ్డి, వెంకటరామిరెడ్డి, అశ్వర్ధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి తండ్రి మృతి

– ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మండల టీడీపీ నాయకులు



**బేతంచెర్ల, జూన్ 25, ప్రభాతవార్త:** పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు ఆవుల రామకృష్ణ తండ్రి ఆవుల హనుమయ్య(65) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, పలువురు టీడీపీ నాయకులు హనుమయ్య భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య మద్దమ్మకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారితోపాటు రమేష్ యాదవ్, వేణు, మోహన్ గౌడ్, రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

## విదేశీ విద్యకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును పునరుద్ధరించడం హర్షణీయం



**బేతంచెర్ల, జూన్ 25, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే విదేశీ విద్య పథకానికి పునరుద్దరించడం హర్షణీయమని టీడీపీ నాయకులు మేకల నాగరాజు, రవీంద్ర నాయక్, రూబెన్‌లు అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్దకు వారు చేరుకుని అంబేద్కర్‌కు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వం పేద విద్యార్థుల్లోని ప్రతిభావంతులకు విదేశీ విద్యను అభ్యసించేందుకు తోడ్పాటుగా ఉండే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని ప్రారంభించి వేలాది మంది విద్యార్థులను విదేశాలకు పంపడం జరిగిందన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ పేరును తొలగించి జగనన్న విదేశీ విద్య పేరుగా మార్చడం సిగ్గుచేటన్నారు. అందులోను ఆ పథకం ద్వారా గత ఐదు సంవత్సరాల్లో ఏ ఒక్క పేద విద్యార్థి విదేశాలకు పంపిన దాఖలాలులేవని వారన్నారు. కూటమి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును విదేశీ విద్య పథకానికి పునరుద్దరించడం హర్షణీయమన్నారు. దీంతో పలువురు ప్రతిభావంతులైన పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించేందుకు చక్కటి అవకాశం ఏర్పడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. పథకం పునరుద్దరణ పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. వారితోపాటు కౌన్సిలర్ రామగోపాల్, నాయకులు రామతిమ్మయ్య, లొడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరు ఎమ్మెల్యేను కలిసిన గడివేముల టీడీపీ కన్వీనర్



**గడివేముల, జూన్25, ప్రభాతవార్త;** గడివేముల మండల టీడీపీ నాయకుడు, మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి మంగళవారంనాడు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు బాణసంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, రిటైర్డ్ ఆర్మీ జమాల్‌బాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిని సన్మానించిన ఏపీటీఎఫ్ నాయకులు



**కౌతాళంరూరల్, జూన్25, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన కౌతాళంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చెన్నబసప్పని మంగళవారం తెలుగు రైతు జిల్లా కార్యదర్శి క్లస్టర్-3, ఇన్‌చార్జి అల్లూరి వెంకటపతిరాజులను ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిశారు. వారికి దుశ్శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. నూతన డైరీ, క్యాలెండర్‌లను అందజేశారు. ఉపాధ్యాయ రంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేయాలని వారు కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, బూట్లు పంపిణీ



**ఆత్మకూరు జూన్25,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో అభ్యశించే బాలికలకు, విద్యార్థులకు సూ క్లు బ్యాగులు, బూట్లు, బెల్టు, టై, రెండు జతల సాక్స్‌లతో పాటు ఇతర సామాగ్రిని అందించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారని ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారి సురేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఉర్దు బాలికల ఉన్నత పాఠశాలలో స్కూలు బ్యాగులు, బెల్టు, ఇతర సామాగ్రిని పరిశీలన చేశారు. మొత్తం బూట్లు బాలురకు 2,287మందికి వచ్చిన్నట్లు వివరించారు. బాలికలకు 2,891మందికి అందిస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 10వతరగతి పిల్లల వరకు ఈ బూట్లతో పాటు రెండు జతల సాక్స్ అందించనున్నారు. వీటితో పాటు 6022మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులు అందిస్తున్నట్లు తెలిపారు. 1 నుంచి 5వరకు బెల్టులు 4,075, 6 నుంచి 10వరకు బాలురులకు ఇవ్వన్నట్లు తెలిపారు. నోట్ బుక్స్ 35,175మందికి రాగా మొత్తం 58 ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటి వరకు 1నుంచి 10తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు 44,948మంది విద్యార్థులకు అందించిన్నట్లు వెల్లడించారు. మొత్తం ప్రభుత్వ పాఠశాలలో 56వేల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి చేయగా మరో 11వేల పాఠ్యపుస్తకాలు కోరత ఏర్పడిందని త్వరలోనే విద్యాశాఖ అధికారుల నుంచి పంపిణిచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు, బాలురులకు మధ్యాహ్న బోజన పథకం, పాఠ్యపుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణి చేసి విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడం ప్రభుత్వ పాఠశాలలో సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వీరి వెంటా కార్యాలయ సిబ్బంది ఖాజామోద్దిన్, ఈశ్వర్‌నాయక్, మహ్మద్‌బాష, హుసేన్, రఫిక్, పిఆర్‌టిలు మస్తాన్, కృష్ణాకాంత్, పాల్గొన్నారు.

## నందీశ్వర స్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్25, ప్రభాతవార్త**



లోక కల్యాణం కొసం దేవస్థానం మంగళవారంనాడు ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరస్వామికి(శనగల బసవన్న స్వామివారికి)విశేషార్చనలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా(సర్కారిసేవగా)ఈ కైంకర్యం జరిపించబడింది. ప్రదోశకాలంలో అనగా సాయం సంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరిగింది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌబాగ్యాలతో విలసిల్లాలని ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్దిగా ఉండాలని అన్ని సామాజికవర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండింతులు సంకల్పాన్ని చెప్పడం జరిగింది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతి పూజను జరిపించబడింది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ మరియు మల్లికగుండంలోని శుద్దజలంతో అభిషేకం నిర్వహించారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించడం జరిగింది. తరువాత నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరిగింది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడింది.

## పదవీ విరమణ పొందిన పోలీస్ జాగీలం టీనా...



**నంద్యాల క్రైం, జూన్ 25, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ల్యాబ్రోడర్ రైత్రిబర్ జాతికి చెందిన పోలీస్ జాగీలం టీనా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల పదవీ విరమణ కావడం జరిగింది. కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా సాయుధ రిజర్వు పోలీస్ ఘనంగా నిర్వహించారు. ఈ పోలీసు జాగీలం ప్రతి విఐపి, వివిఐపిల బంధోబస్తు విధుల్లో పాల్గొంటారు. ఎక్కడైనా పేలుడు పదార్థాలు ఉన్నయెడల కనుగొనడానికి టీనా యొక్క ప్రత్యేకత. ఈజాగీలం వయసు 9 సంవత్సరాలు 7 నెలలుగా ఉంది. ఉమ్మడి జిల్లాలో పోలీస్‌శాఖలో సేవలు అందించి పదవీ విరమణ చేయడం జరిగింది. ఈసందర్బంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడినప్పటి నుండి నేటి వరుకు జిల్లా నందు పలురకాలైన డ్యూటీలు విఐపి, వివిఐపి డ్యూటీలు, శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాలకు, ఉగాది బ్రహ్మోత్సవాలకు, తిరుపతిలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిందని తెలిపారు. అలాగే అసెంబ్లీ బందోబస్తు, చీఫ్ మినిస్టర్ పర్యటన నంద్యాల జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో సేవలు అందించిందన్నారు. ప్రధాని తిరుపతి పర్యటన, విజయవాడలో కూడ సేవలు అందించిందని తెలిపారు. వివిధ కేసుల దర్యాప్తులో సహకారం అందించిందని ప్రశంసించారు. అనంతరం టీనా యొక్క అడ్లార్ ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ సుంకిరెడ్డిని సత్కరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు అడిషనల్ అడ్మిన్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి -డాక్టర్.భారతిదేవి




**వెల్దుర్తి, జూన్25, ప్రభాతవార్త :** డయేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెల్దుర్తి హోమియోపతి డాక్టర్.భారతిదేవి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులోని దాసరివీధి ప్రజలకు మంగళవారం డయేరియాపై ఆమె అవగాహన కల్పించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సైతం ఆమె ప్రజలకు వివరించారు. ఈ సందర్బంగా డాక్టర్.భారతిదేవి మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే త్రాగాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలన్నారు. బాగా ఉడికించిన ఆహారపదార్థాలను తినాలన్నారు. మీ ఇంటి చుట్టూ పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అరుణ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రులను కలిసిన ఏపి అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

**వెల్దుర్తి, జూన్25, ప్రభాతవార్త**

ఏపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులైన నారాలోకేష్, గుమ్మిడి సంధ్యారాణిలను వారు మర్యాదపూర్వకంగా కలిసి బోకెలు అందించారు. ఈ సందర్బంగా ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఏపి అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జె.లలిత, ఎస్.మంజుల, జి.మల్లేశ్వరిలు మాట్లాడుతూ తమకు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమనిర్బంధాలు, అరెస్టులు, ధర్నాల సమయంలో నారాలోకేష్ స్వయంగా హాజరై తమకు పలు హామీలు ఇచ్చారని వాటిని గుర్తుచేశామన్నారు. దీంతో మంత్రి నారాలోకేష్ సైతం మీ న్యాయమైన డిమాండ్లు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు.



## నిషేధి మందులను అమ్మితే కఠిన చర్యలు



**అవుకు, జూన్ 25, ప్రభాతవార్త:** అవుకు మండల ఏఓ అబ్దుల్ హాక్ మంగళవారం పట్టణంలోని శ్రీనివాస ఏజెన్సీ, ఎంసిఎస్ నరసింహులు, ఫర్టిలైజర్ ఫెస్టిసైడ్స్ ఎరువుల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగ ఏఓ స్టార్ రిజిష్టర్, బిల్లు బుక్కులను పరిశీలించి రైతులందరికి బిల్లులు అందించాలని అలాగే ప్రభుత్వం నిషేధించిన మందులను అమ్మితే దుకాణం లైసెన్స్ రద్దుచేస్తామని మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా రైతులు కూడ బయో ఫెస్టిసైడ్స్‌ను కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం నిషేధించిన వాటిని కొనరాదని కొనుగోలు విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

–ఆత్మకూరు సిఐ నాగభూషణం



**పాములపాడు, జూన్ 25, ప్రభాతవార్త:** విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని ఆత్మకూరు సిఐ నాగభూషణం అన్నారు. మంగళవారం పాములపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ ఆశోక్ అధ్వర్యంలో మాధకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, పొగాకు, ఖైనీ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాల భారీనపడితే ప్రాణాంతక వ్యాధులు దరిచేరుతాయన్నారు. యువతీ యువకులు మంచి లక్షణాలు అలవర్చుకోని భవిష్యత్తుకు పునాదిరాళ్లు వేసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు, భవిత పాఠశాల ఉపాధ్యాయులు షంశుద్దిన్, రాంమూర్తిలు పాల్గొన్నారు.

## శ్రీశైలక్షేత్ర పాలకుడికి ప్రదోషకాల అభిషేకం

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్25, ప్రభాతవార్త**



శ్రీగిరిక్షేత్రంలో లోక కల్యాణం కోసం దేవస్థానం మంగళవారంనాడు సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ఆగమసంప్రదాయాయంలో క్షేత్రపాలక పూజకు చాల విశేషస్థానం ఉంది. క్షేత్రపాలకుడు పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయబాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోశాలు, దుష్టగ్రహపీడలు తోలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభపలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, గందోధకం, పుష్పోదకం, శుద్దజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరిగింది.

## వీల్‌చైర్ వితరణ చేసిన కాత్యాయని మెడికల్ స్టోర్



**బనగానపల్లె, జూన్ 25, ప్రభాతవార్త:** బనగానపల్లెలోని శ్రీ కాత్యాయని మెడికల్ స్టోర్ యాజమాన్యం వారు బనగానపల్లె రూరల్ సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం వీల్‌చైర్‌ను వితరణ గావించారు. వివరాల మేరకు బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మనోహర్ రావు మాతృమూర్తికి గతంలో జరిగిన ఓ యాక్సిడెంట్‌లో రెండు కాళ్లు పొగొట్టుకుని నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీ కాత్యాయని మెడికల్ స్టోర్ యజమాని, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మారుతి కుమార్, నాగార్జునరెడ్డిలు వీల్‌చైర్‌ను సీఐ ఆధ్వర్యంలో అందించి మానవత్వం చాటుకున్నారు.

## యాగంటిపల్లె కల్వర్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన్ ఆర్‌అండ్‌బీ అధికారులు



**బనగానపల్లెరూరల్, జూన్ 25, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో గల కల్వర్టు పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ పనులను మంగళవారం ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈఈ సునీల్, ఏఈఈ హుసేనిలు ఆకస్మికంగా తనిఖీ చేసి పనులు సజావుగా, వేగవంతంగా జరుగుతుండడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులు టీడీపీ నాయకులు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు వేగవంతంగా కల్వర్టు నిర్మాణాన్ని చేపడుతున్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ ఈ కల్వర్టు పనులను స్థానిక టీడీపీ నాయకులు బండి మౌళీశ్వరరెడ్డి చాలా వేగంగా కొనసాగిస్తున్నారని అదే విధంగా పనుల్లో నాణ్యతతో పనులు చేపడుతున్నారని వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

## కోట్ల విజయంతో మొకాళ్ల పై తిరుపతి మెట్లెక్కి మొక్కు తీర్చుకున్న అభిమాని



**బేతంచెర్ల, జూన్ 25, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల్లో డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి విజయం సాధించడంతో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి తిరుమల మెట్లను అంబాపురం సర్పంచ్ శ్రీనివాసుల యాదవ్ మొకాళ్ల ఎక్కి మొక్కు తీర్చుకున్నారు. డోన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి బుగ్గన టీడీపీ అభ్యర్థి కోట్ల మధ్య రసవత్తరమైన హోరాహోరీ పోరు నడిచిన నేపథ్యంలో పలువురు ఇరువర్గాల అభిమానులు పందెలు, మొక్కులు, ఛాలెంజ్‌లు వేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, అంబాపురం సర్పంచ్ శ్రీనివాసుల యాదవ్ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి విజయం సాధిస్తే తిరుపతి మెట్లను మొకాళ్లతో ఎక్కి మొక్కు తీర్చుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 24వ తేది రాత్రి తిరుపతి మెట్లను మొకాళ్లతో ఎక్కి మొక్కు తీర్చుకున్నట్లు శ్రీనివాసుల యాదవ్ తెలిపారు.

## డయేరియాపై స్పెషల్ డ్రైవ్

**అవుకు, జూన్ 25, ప్రభాతవార్త:** అవుకు గ్రామపరిధిలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఈఓ అశ్వనీకుమార్ నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేకదృష్టి నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈసందర్బంగా పట్టణంలో పలు వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి అవగాహన కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈకార్య క్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి విశేష అభిషేకం

**శ్రీశైలంప్రాజెక్టు, జూన్25, ప్రభాతవార్త**



శ్రీగిరిక్షేత్రంలో లోక కల్యాణం కొసం దేవస్థానం మంగళవారంనాడు ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి(కుమారస్వామి)వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్టి తిధి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా(సర్కారిసేవగా) నిర్వహించబడింది. కాగా కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోక కల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉధ్యోగ, వ్యాపార, వ్యవహారాలలో అటుపోట్లు తొలగిపోయి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. ఈ అబిషేకానికి ముందుగా దేశం శాంతిసౌబాగ్యలతో విలసిల్లాలని, ప్రకృతివైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, జనులకు ఆయారారోగ్యాలు, అన్ని సామాజిక వర్గాలు ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజ జరిపి అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకం, సుబ్రహ్మణ్యఅష్టోత్తరము చేసిన అనంతరం సుబ్రహ్మణ్యస్తోత్రము పారాయణలు చేసారు. అదే విధంగా స్వామివారికి అభిషేకంతో పంచామృతాలతోనూ, వివిధ పళ్ల రసాలతోచేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# జాతీయ రహదారి నిర్మాణంలో...

- సమస్యలను పరిష్కరిస్తు పనులు చేపట్టండి
- త్వరగా పరిహారం అందించాలి
- జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి





**పాములపాడు, జూన్ 25, ప్రభాతవార్తః** జాతీయ రహదారి 340 సి నిర్మాణంలో భాగంగా ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తు పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను అదేశించారు. మండలంలోని కృష్ణారావు పేట, పాములపాడు, ఎర్రగూడూరు గ్రామాల్లో జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కృష్ణారావు పేట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంతో పాటు ప్రాథమిక పాఠశాల వంటి సమస్యలు జేసి దృష్టికి తెచ్చారు. వీటికి పరిహారం ఇంతవరకు జమకాలేదని పనులు ఎలా చేపడతారని గ్రామస్థులు ప్రశ్నించారు. తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ వెంకటరమణకు అదేశించారు. అలాగే రుద్రవరంలో వీరస్వామికి చెందిన ఇల్లు కూల్చివేస్తే ప్రత్యామ్నాయంగా నివాసం ఉండేందుకు 15 రోజులు సమయం ఇవ్వాలని కోరగా మూడు నాలుగు రోజులు సమయం తీసుకొని పనులు చేపట్టాలని సూచించారు. అలాగే జెరుషలేం షాలను పరిశీలించి జాతీయ రహదారి ప్రాముఖ్యతను నిర్వహకులకు వివరించారు. అడ్డగిస్తే డిజైన్ మార్చడానికి అవకాశం లేదని అయితే కొందరు మహిళలు రోధిస్తు జాయింట్ కలెక్టరు కారుకు అడ్డుతగిలారు. అయినప్పటికి పనులు యధావిధిగా చేపట్టాలని జేసి సిబ్బందికి సూచించారు. పాములపాడులో ఓ ప్రైవేట్ పాఠశాల స్థలాన్ని, అక్కడి ఇళ్ళను జేసి పరిశీలించారు. ఎర్రగూడూరు గ్రామంలో హైవే పనుల్లో తాగునీటి ట్యాంకు కోల్పోతుందని దానికి ప్రత్యామ్నాయం చూపాలని గ్రామస్థులు జేసి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా చాలమంది బాధితులకు పరిహారం చెల్లించలేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. జేసి వెంట ఎన్‌హెచ్ఎఐ పిడి గోర్ధన్ గవిన్‌ల, ఆత్మకూరు ఆర్డీఓ దాసు, డిప్యూటి తహశీల్దార్ పఠాన్ బాబు, ఎంఈఓ బాలాజీ నాయక్, ఎస్ఐలు ఆశోక్, లక్ష్మీనారాయణ, సర్వేయర్ భాస్కర్ తదితరులున్నారు.

## అల్ట్రాటెక్ కంపెనీ మల్లేశ్వరరెడ్డి పై కేసు నమోదు - ఆర్అండ్‌బీ ఈఈ



**బనగానపల్లెరూరల్, జూన్ 25, ప్రభాతవార్త:** అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ, మల్లేశ్వరరెడ్డి అనే వ్యక్తి పై కేసు నమోదుచేసినట్లు ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నందు శ్రీధర్‌రెడ్డి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్ల ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా 22వ తేది శనివారం కోవెలకుంట్ల రహదారి నుండి అవుకు మీదుగా తాడిపత్రికి వెలుతూ తుమ్మలపెంట మీదుగా అంకిరెడ్డిపల్లెకు చేరుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు రోడ్డుకు ఎడవ వైపున 150 మీటర్లు రెండు చోట్ల ఆఫ్ మీటర్ తోతు వరకు రహదారిని తవ్వారని గుర్తించడం జరిగిందన్నారు. ఎవరు తవ్వీరని విచారిస్తే అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ వారు మల్లేశ్వరరెడ్డి అనే వ్యక్తికి రోడ్డును నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారని తెలిసిందన్నారు. అయితే ఆ రోడ్డు 15మీటర్లు ఉందని 6 మీటర్లు కట్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందని తెలిపారు. ఈ మేరకు వారు ఆర్అండ్‌బీ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంతో అల్ట్రాటెక్ కంపెనీ పై, మల్లేశ్వరరెడ్డి పై రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని కేసు నమోదుచేసినట్లు శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. సోషల్ మీడియాలో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కేసు నమోదు చేయించినట్లు ప్రచారం జరుగుతుందని ఇందులో వాస్తవంలేదని దీని పై మంత్రి ఎలాంటి జోక్యం చేసుకోలేదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అలాగే నియమ నిబంధనల మేరకే కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వారు కాని, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వారు కాని, ఇంకా ఏ శాఖకు చెందినవారైనా రోడ్డును తవ్వాల్సి ఉంటే తప్పక తమ శాఖ అనుమతి ఉండాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈఈ హుసేని తదితరులు పాల్గొన్నారు.

## టెట్ ఫలితాలు విడుదల

**- అర్హత సాధించని వారికి మరోఛాన్స్**



**నంద్యాల విద్య, జూన్ 25, ప్రభాతవార్తః** ఏపీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేయడానికి అసక్తిగల అభ్యర్తుల కోసం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత టెట్-2024 పరీక్ష ఫలితాలు మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఈఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు ఫిబ్రవరి నెలలో టెట్ పరీక్షను నిర్వహించారు. ఇందులో 2,67,789 మంది ధరఖాస్తు చేసుకోగా 1,37,984 మంది 58.4 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈటెట్‌లో క్వాలిఫై కానీ అభ్యర్థులకు మరోసారి టెట్ నిర్వహిస్తామని, కొత్తగా బిఈడి, డిఎడ్ పూర్తి చేసినవారికి టెట్‌లో అవకాశం కల్పిస్తామని టెట్ తర్వాతే డిఎస్సీ నిర్వహిస్తామని తెలిపారు. టెట్ ప్రశ్నపత్రాన్ని 150 మార్కులకు ఇచ్చారని ఇందులో 60 శాతం మార్కులు వచ్చిన వారు టెట్ క్వాలిఫై అయినట్ల తెలిపారు. ఓసిలకు 90 మార్కులు, బిసిలకు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్‌సి, ఎక్స్‌సర్వీసువారికి 60 మార్కులు వస్తే క్వాలిఫై అయినట్లుగా గుర్తిస్తామన్నారు. తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు తిరిగి మరోసారి పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

## వైసిపి పాలనలో పడరాని పాట్లు పడ్డాం.. ఎవరినీ వదలం..!



**నంద్యాల, జూన్ 25,ప్రభాతవార్తప్రతినిధి** వైసిపి పాలనలో తనతో పాటు తమ కార్యకర్తలను నానా ఇబ్బందులు పెట్టారని ఇప్పుడే ఎవరినీ వదిపట్టమని రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి అన్నారు. స్పీకరు ఎన్నికల సందర్భముగా అయనకు దన్యావాదాలు చెప్పే కార్యక్రమంలో బాగంగా రోడ్డుభవనాల శాఖ మంత్రి బిపిజనార్ధనరెడ్డి మాట్లాడుతూ తాను 2014నుండి 2019 వరకు మొదటి సారి శాసన సభ్యుడిగా పని చేశాము., నాడు మేము అబివృద్దిని పుంతలు తోక్కించామని చెప్పారు. అయితే 2019 ఎన్నికల్లో కొన్ని కారణాల వల్ల ఓటమి చెందిగా తనతో పాటు తన కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. తనతను అయితే అరెస్టు పోలీసులు వైసిపి నాయకులు అదేశాల మేరకు ఏకంగా అదోని సబ్ జైలుకు పంపారని చెప్పారు. బనగానపల్లె ఎక్కడ అదోని ఎక్కడ అద్యక్షా. మాకు దగ్గరలో అళ్లగడ్డ, డోన్, నంద్యాల కాదని తనతను హత్యలు చేసి నిందితుడి మాదిరాగా ఏకంగా అదోనిలో 32 రోజుల పాటు పెట్టారని అన్నారు.అలాగే మాలాగే మీరు ఎన్నో కష్టాలు పడ్డారు అపానలో వాటిని అన్నింటి ఓర్చుకుని ఇంత ఉన్నతమైన పదవిలో కూర్చున్నారు.అందుకు మీకు దాన్యవాదాలు, అలాగే మీరు ఎన్నో సార్లు రోడ్డు భవనాల శాఖ మంత్రిగా పని చేశారు మీ సలమాలు తీసుకుని ఎపిలోని రోడ్లను అన్నింటి మన ముఖ్యమంత్రి సహకారముతో పూర్తి చేస్తామని చెప్పారు.అలాగే మము మ్మలను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరినీ వదలి పట్టమన్నారు.

## ఆలూరు నియోజకవర్గ సమస్యలు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తాం..!

**- జనసేన ఆలూరు ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప**



**దేవనకొండ,జూన్ 25,ప్రభాతవార్త** త్వరలోనే ఆలూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప అన్నారు. పంచాయతీ రాజ్,తాగునీరు,అటవీశాఖ,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలపై దేవనకొండ,ఆలూరు అధికారులను తెర్నేకల్ వెంకప్ప మంగళవారం కలిసి సలహాలు,సూచనలు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజలకు,రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించడంతో పాటు గ్రామాలు అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. పార్టీలకు అతీతంగా భాద్యతగల రాజకీయం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జగదీష్,వీరేష్,నందు, బడేసాబ్,ఆంథోని, కృపాకర్,రామలక్ష్మణ్,సరోజ,రంజిత్,చత్రపతి,మహేష్,యశోద,చంద్ర మౌళి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ప్రభుత్వం మరో పథకం పేరు మార్చింది

**- వైయస్ఆర్ భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్పుచేసింది**

**నంద్యాల విద్య, జూన్ 25, ప్రభాతవార్తః** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఉన్న పథకాలన్నింటిని టిడిపి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన తరువాత అన్ని పథకాల పేర్లను మార్పు చేసింది. ఇప్పటికే అన్ని పథకాలను మార్చింది. మంగళవారం కూడ వైయస్ఆర్ రైతుభరోసా పథకం పేరును మారుస్తు అన్నదాత సుఖీభవగా మార్పుచేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు వెబ్‌సైట్‌లలో కూడ ముఖ్యమంత్రి ఫోటోలను మార్పుచేసింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ స్థానంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోలను వెబ్‌సైట్ లలో పెట్టారు. ఇప్పటికే వైయస్ఆర్ కళ్యాణమస్తును చంద్రన్న పెళ్లికానుకగాను, వైయస్ఆర్ విద్యోన్నతి పథకాన్ని ఎన్‌టిఆర్ విద్యోన్నతి పథకంగా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాన్ని పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకంగా, జగనన్న విదేశీ విద్య పథకాన్ని అంబేద్కర్ ఓవర్‌సిస్ విద్యానిధి పథకంగా, వైయస్ఆర్ బీమా పథకాన్ని చంద్రన్న భీమా పథకంగా, వైయస్ఆర్ ఉచిత విద్యుత్ పథకాన్ని ఏపీ ఉచిత విద్యుత్ పథకంగా, వైయస్ఎస్ పెన్షన్ పథకాన్ని ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీం పథకంగా, జగనన్న విద్యాపథకాన్ని స్టూడెంట్ కిట్ పథకంగా, జగనన్న గోరుముద్ద పథకాన్ని పిఎం పోషన్ గోరుముద్ద పథకంగా, దిశ పోలీస్‌స్టేషన్ పథకాన్ని మహిళా పోలీస్‌స్టేషన్ పథకంగా, స్పందన పథకాన్ని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సస్ సిస్టం పథకంగా మార్పు చేశారు,

## సమస్యలన్ని పరిష్కరించి మార్కెట్‌ను అన్నివిధాల అభివృద్ధి చేస్తాం

**- ఎన్ఎండి ఫిరోజ్**

**నంద్యాల, జూన్25, ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద గల కూరగాయల మార్కెట్‌లోని సమస్యలన్ని పరిష్కరించి అన్నివిధాల అభివృద్ధి చేస్తామని టిడిపి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనరులతో కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. కూరగాయలు మరియు నిత్యావసర సరుకుల వ్యాపారస్థులు తమ సమస్యలైన రోడ్లు, వీధి దీపాలు, ట్రాఫిక్, పార్కింగ్, మురుగునీరు కాల్వల నిర్వహణ లేకపోవడం తదితర వాటిని ఎన్ఎండి దృష్టికి తీసుకురావడంతో అక్కడే జాయింట్ కలెక్టరు, మున్సిపల్ కమిషనర్‌తో చర్చించడం జరిగింది. ఈసందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో హామి ఇవ్వడం జరిగిందని అందులో భాగంగా ఈరోజు జేసి, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామి మేరకు ఎల్లప్పుడు నంద్యాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. త్వరలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన ప్రభుత్వ అధికారులు, కూరగాయల వ్యాపారస్థులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి అందరి సలహాలు తీసుకొని నూతన కార్యచరణ రూపొందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వ్యాపారులకు హామి ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో కూరగాయాల మారెక్కెట్ వ్యాపారస్థులు, నిత్యావసర సరుకుల వ్యాపారస్థులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు అండగా ఉంటా..

**- మాజీ ఎమ్మెల్యే శిల్పా**



**నంద్యాల క్రైం, జూన్ 25, ప్రభాతవార్తః** వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళల అండగా ఉంటానని మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా పై దాడి, దౌర్జన్యానికి పాల్పడడం, హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇటీవల స్థానిక 29వ వార్డు సచివాలయంలో ముస్లీం మైనార్టీలకు చెందిన నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాపై దౌర్జన్యం, దాడియత్నం ఘటన బాధకర విషయమని అందోళన వ్యక్తం చేశారు. నంద్యాల నియోజకవర్గ పరిధిలో శిలాఫలకాలను విధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాల ప్రశాంత వాతావరణానికి నిలయమని ఈసందర్భంగా పోలీసులను కోరారు. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై బహిరంగంగా వివరిస్తామన్నారు.

## మోసపూరిత కార్యకలాపాల పట్ల అప్రమత్తత ముఖ్యం

**కర్నూలు హాస్పిటల్, జూన్ 25, ప్రభాతవార్తః** మోసపూరిత బృందాలు అధిక రాబడిని వాగ్దానం చేయడం ద్వారా సున్నితమైన సమాచారాన్ని వినియోగదారరుల నుంచి రాబట్టడంతో పాటుగా నిధులు తస్కరించే అవకాశం ఉందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సిడీవో అండ్ సీవోవో సందీఫ్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సీ సెక్యూరిటీస్ యూజర్ ఐడి మరియు పాస్‌వర్డు వంటి ట్రేడింగ్ అధారాలు ఇవ్వవద్దని తమ కస్టమర్లను కోరుతుందన్నారు. పెట్టుబడి దారులు మోసపూరిత కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండడం, సమగ్ర పరిశోధన, విశ్వసనీయ సమాచారం అదారంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం చాల కీలకమన్నారు. వాట్సప్ లేదా అనధికార చానల్స్ ద్వారా అధార్, లేదా పాన్‌కార్డు వివరాలతో సహా వ్యక్తిగత సమాచారాన్ని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అభ్యర్థించదన్నారు. అనుమానస్పద కార్యకలాపాలను, గ్రూప్‌లను కస్టమర్లు ఎదుర్కొన్నట్లయితే వారు వెంటనే వాటిని నిర్దేశిత కస్టమర్ సేవా బృందానికి నివేదించాలని సూచించారు.

## పట్టా ఒకరి పేరు మీద.. రిజిస్ట్రేషన్ మరొకరి పేరుమీద..!

**పత్తికొండ, జూన్ 25, ప్రభాతవార్త** గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలలో పట్టా ఒకరి పేరు మీద ఉంటే..రిజిస్ట్రేషన్ మరొకరి పేరు మీద ఉందని భాదితులు వాపోతున్నారు. వివరాల మేరకు పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన షేక్ ఖాజాబీ అనే మహిళలకు గత ప్రభుత్వంలో ఇంటి పట్టా మంజూరైంది. బేస్ మట్టం వరకు నిర్మాణ పనులు కూడా జరిగాయి. అయితే రిజిస్ట్రేషన్ మాత్రం వేరొకరి పేరు మీద ఉందని భాదితురాలు వాపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్వేనంబర్ 130/2లో ప్లాట్ నంబర్ 120లో ఇద్దరి పేరు మీద ఇంటి పట్టాలు మంజూరైంది. రెవెన్యూ అధికారులు తనకు న్యాయం చేయాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేడు,రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని భాదితురాలు షేక్ ఖాజాబీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల పంపిణీలో అన్నీ అవకతవకలు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికులకు కాకుండ ఇతర ప్రాంతాల వారికి పట్టాలు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు స్థానిక ప్రజల ఆగ్రహానికి గురయ్యారు. ఈ పట్టాలన్నింటిని రీ వెరిఫికేషన్ చేసి స్థానికులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## ప్రధాని నరేంద్రమోడీని కలిసిన బైరెడ్డి కుటుంబ సభ్యులు



**నందికొట్కూరు,జూన్ 25, ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్రమోడీని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలువగా ప్రధాని ఆమెను అభినంధించారు. మంగళవారం పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో యం.పి.బైరెడ్డి శబరితో పాటు ఆమె తల్లి బైరెడ్డి భారతి, తండ్రి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మరియు కుటుంబసభ్యులు డాక్టర్.శివచరణ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బైరెడ్డి శర్వాని ప్రధానిని కలిసారు.

# సంక్షేమ హాస్టల్ విద్యార్థుల అరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి

**: అన్ని వసతి గృహాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేయండి**



**నంద్యాల, జూన్ 25,ప్రభాతవార్తప్రతినిధి** సంక్షమ హాస్టల్స్ రెసిడెన్సీయల్ పాఠశాల్లో నాన్యమైన విద్యను అందించడంతో పాటు అక్కడున్న విద్యార్థుల అరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుని ఉత్తీర్ణత శాతము పెంచాలని జిల్లాకలెక్టరు డాక్టరు కె.శ్రీనివాసులు చెప్పారు. మంగళవారము కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్లో సంక్షేమ హాస్టల్స్ పనితీరు విద్యార్థుల అడ్మిషన్ మౌలిక వసతులపై జాయింట కలెక్టరు టిరాహుల్‌కుమారరెడ్డితో కలిపి కలెక్టరు సుదీర్గ సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ పద్మజ, అన్ని సంక్షమ హాస్టల్స్ ఉన్నతాదికారులు తదితరులు పాల్గొన్నారు. ఈసైందర్బముగా కలెక్టరు మాట్లాడుతూ సంక్షేమ రెసిడీన్సీయల్ పాఠశాల్లో ఖాళీగా ఉన్న సీట్లన్నీ భర్తీచేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తీర్ణత శాతమును పెంచాలని హాస్టల వెల్ఫేర్ అదికారులను అదేశించారు. విద్యార్థులకు టాయిలెట్లు బాత్రూంలు త్రాగునీటి సౌకర్యము తదితర వసతులు కల్పనలో అసౌకర్యాలు కల్పించకుండా అకాశముం ఉన్నంతవరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మోనూలో మార్పులు జరిగినా అమారము కలుషితమైన సంబందిత వార్డన్‌లపై నేరుగా తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టరు స్పష్టము చేశారు. వర్షాకాలంలోదోమల వ్యాప్తి విపరీతముగా ఉంటుందని విద్యార్థుల అరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు,శ్రద్ద తీసుకుని దాతల సహకారముతో లేదా అందుబాటులో ఉన్న నిదులతో మస్కిటో నెట్‌లను ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టరు అదేశించారు. త్రాగునీరు కలుషితము కాకుండా సురక్షిత మంచినీరు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్ భవనాలు పరిసర ప్రాంతాల్లో పారిశుద్య చర్యలు ముమ్మరంగా చేపట్టి పరిశుబ్రంగా ఉంచుకునేలా చర్యఉ తీసుకోవాలన్నారు. అనంతరము హాస్టళ్ల వార్డన్ వారిగి వసతుల లేమి కల్పిస్తున్న సౌకర్యాలపై అరాఇ తీస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల నిర్వహణపై ఇటీవల తహశీలుదారులతో అకస్మిక తనికీలు నిర్వహించి నివేదికలు సేకరించామన్నాపరు. జిల్లా 38 సాంఘిక సంక్షేమ హాస్టల్స్ 34బిసి వేల్ఫేర్ హాస్టల 13 ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స 46కెజిబివిరెసిడెన్సీయల్ పాఠశాలలే ఏడు అంబేత్కరు గుకుల పాఠశాలలు అరు జ్యోతిరావు పూలే పాఠశాలలు వున్నాయని వీటి పనితీరుపై ఇటీవల తహశీలుదార్లతో తనికీలు నిర్వహించి సమస్యలను గుర్తించామన్నారు. గుర్తించిన సమస్యల పరిస్కారానికి ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని సంబందిత హస్టల్ ప్రిన్సుపాల్‌లను కలెక్టరు అదేశించారు., అలాగే ప్రతి హస్టల్లో ఉన్న స్రైంగ్డ్ స్టాఫ్ పోజిషన్ వెకెన్సీ తదితర వివరాల నివేదికలను ఇవ్వాలన్నారు. బొమ్మల సత్రములోని సోషియల వెల్ఫేర్ బాయ్స్ హస్టల్ ఉయ్యాలవాడలోని హస్టల్లట్ల టాయిలెట్టు పని చేయడములేదని రన్నింగ వాటర్ సరఫరా కావడము లేదని పలు సమస్యలు ఉన్నట్లు నివేదించారని ఈ విషయంపై హస్టల్ అదికారులను అరా తీయగా సంబందిత సంక్షేమ అదికారులు ఇచ్చిన సమాదానముపై కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు అదే స్థానములో మన పిల్లలు ఉంటే ఇలాగే చేస్తామా అని కలెక్టరు ప్రశ్నించారు. కనీసము సౌకర్యాల కల్పనపై జోక్యము చేసుకుని వసతులు ఏర్పాట్లు చేయాలని అదేశించారు .వసతులు కల్పించేం దుకే మనం ఉద్యోగం చేస్తున్నామని మనకన్నా తెలివైన వాళ్లు ఉద్యోగాలు లేక బయట తిరుగుతున్నారని ఈ విషయాన్ని గుర్తించి చేస్తున్న వృత్తిలో పినతీరు మెరుగుపరచుకోని బాద్యతాయుతముగా ఉండాలని సంక్షేమ అదికారులను కల్క్టెరు అదేశించారు. అన్ని హస్టల్లో తాత్కాలిక సౌకర్యాలకు పాఠశాలల నిర్వహణ నిదుల కిందఖర్చు చేసి అవసరమైన మరమ్మత్తులు చేసి మూడు రోజుల్లో నివేదికలను ఫోటోలతో సహా ఇవ్వాలని సంక్షేమ హస్టల ఉన్న అదికారులను అదేవించారు. హస్టల్లకు ప్రహారి గోలు అరోవ్వ వాటరు ప్లాంట్ లు తదితర పనులకు ప్రతిపాదనలు సిద్దం చేసి ఇవ్వాలని కలెక్టరు అదేశించారు., రెసిడెన్సియల పాఠవాల్లో సీట్లన్నీ భర్తీ అయితే ఖాళీ ఉన్న సంక్షేమ హస్టల్లో నిబంధనల ప్రకరాము ప్రవేశాలకు చర్యలు తీసుకుని ఈ నెల అఖరులోపు భర్తీ చేయాలన్నారు. సీట్ల కోసం వచ్చేతల్లిదండ్రులను అగౌరవపరచకుండా మర్యాదపూర్వకముగా వాఈరితో సంభాషించి వున్న ప్రభుత్వ నిబందనలుతెలియ చేసి ఖాళీలను పూర్తి చేయాలని అదేశించారు.